ఫ్చ.. త్రుటిలో చేజారె

10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పతక పోరులో అర్జున్‌కు నాలుగో స్థానం

నిరాశపరిచిన రమితా జిందాల్

క్వార్టర్స్‌కు సాత్విక్-చిరాగ్ జోడీ

అర్జెంటీనాతో హాకీ మ్యాచ్ డ్రా

పారిస్ ఒలింపిక్స్

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు తొలి పతకం అందించిన షూటర్లు మరోసారి ముువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించే అవకాశాన్ని త్రుటిలో కోల్పోయారు. రెండో రోజే మను భాకర్ కంచు మోత మోగించడంతో ఆ విజయం ఇచ్చిన స్ఫూర్తితో మరో షూటర్‌కు అందినట్టే అందిన కాంస్యం కొద్దిపాటి తేడాతో చేజారింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మెడల్ రేసులో నిలిచిన యువ షూటర్ అర్జున్ బబుతా.. నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఇదే ఈవెంట్ మహిళల విభాగంలో షూటర్ రమితా జిందాల్ నిరాశపరిచింది. అయితే మను.. సరబ్‌జ్యోత్ సింగ్‌తో కలిసి 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ కాంస్య పోరుకు అర్హత సాధించి మరో పతకం మీద ఆశలు రేకెత్తిస్తోంది. మంగళ వారం ఆ ద్వయం గెలిస్తే భారత ఒలింపిక్ చరిత్రలో ఏ క్రీడాకారుడికీ సాంతకాని రికార్డును దక్కించుకున్నట్టే! ఇక హాకీలో డ్రాతో గట్టెక్కిన భారత్‌కు ఆర్చర్లు మరోసారి నిరాశపరిచారు. బ్యాడ్మింటన్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం క్వార్టర్స్‌కు అర్హత సాధించి చరిత్ర సృష్టించగా లక్ష్యసేన్ అదరగొట్టాడు.

పారిస్: విశ్వక్రీడల్లో రెండోరోజే షూటింగ్‌లో మనూ బాకర్ కాంస్యంతో బోణీ కొట్టిన భారత్.. మూడో రోజు త్రుటిలో పతకం కోల్పోయింది. పురుషుల పది మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్ పతక పోరులో యువ భారత షూటర్ అర్జున్ మెడల్‌పై ఆశలు రేపినా అతడు నాలుగో స్థానంలో నిలవడంతో క్రీడాభిమానుల గుండె పగిలింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 650.1 పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచిన అర్జున్.. ఫైనల్ పోరులో 208.4 పాయింట్లతో నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. చైనా షూటర్ షెంగ్ లిహావో (252.2) స్వర్ణాన్ని గెలుచుకోగా 251.4 పాయింట్లతో విక్టర్ లిండ్‌గ్రెన్ (స్వీడన్) రజతం నెగ్గాడు. క్రొయేషియాకు చెందిన మిరన్ మారికిక్ (230) కాంస్యం సొంతం చేసుకున్నాడు.

ఆ మూడు షాట్లు కుదిరుంటే..

పతక బరిలో 13వ షాట్ వరకూ బబుతా రజతం రేసులో దూసుకెళ్లాడు. 13వ షాట్‌కు 9.9 పాయింట్లే సాధించడంతో అతడు వెనుకబడ్డాడు. మళ్లీ 14వ షాట్‌తో 10.6 స్కోరుతో మెడల్ రేసులోకి వచ్చినా 15వ షాట్‌కు 10.2 పాయింట్లే వచ్చాయి. దీంతో అప్పటిదాకా విక్టర్‌తో 0.1 పాయింట్ల వ్యత్యాసం సిల్వర్ మెడల్ రేసులో నిలిచిన అతడు ఆ తర్వాత మూడో స్థానానికి పడిపోయాడు. 18వ షాట్‌కు 10.2 పాయింట్లు రాబట్టిన అర్జున్.. 20వ షాట్‌కు 10.5 పాయింట్లు సాధిస్తే విశ్వక్రీడల్లో మరోసారి ముువ్వన్నెల పతాకం రెపరెపలాడేది. కానీ అర్జున్ 9.5 పాయింట్లే స్కోరు చేసి నాలుగో స్థానానికి పరిమితమయ్యాడు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో రమితా జిందాల్.. 145.3 పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచింది.

క్వార్టర్స్‌కు సాత్విక్ - చిరాగ్ ద్వయం

భారత బ్యాడ్మింటన్ స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి ద్వయం క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్‌లో ఈ జోడీ.. సోమవారం జర్మనీ జంట మార్క్ లమ్స్‌ఫస్, మార్విన్ సిడెల్‌తో ఆడాల్సి ఉన్నా మార్క్‌కు మోకాలి గాయం కారణంగా అతడు టోర్నీ నుంచి వైదొలగడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. అయితే ఫ్రాన్స్ ద్వయం కొర్వి-లబర్.. ఇండోనేషియా షట్లర్లు రియాన్-ఫజర్ చేతిలో ఓడటంతో సాత్విక్-చిరాగ్ రెండో స్థానానికి దూసుకెళ్లి క్వార్టర్స్ బెర్తును దక్కించుకున్నారు. తద్వారా పురుషుల డబుల్స్‌లో క్వార్టర్స్ చేరిన తొలి భారతీయ జంటగా రికార్డులకెక్కింది. ఈ జోడీ మంగళవారం రియాన్-ఫజర్‌ను ఓడిస్తే గ్రూపులో అగ్రస్థానంతో ముగించే అవకాశం ఉంటుంది.

యువ భారత షట్లర్ లక్ష్యసేన్ ఒలింపిక్స్ అరంగేట్ర మ్యాచ్‌లో బోణీ కొట్టాడు. పురుషుల సింగిల్స్ గ్రూప్-ఎల్ లో భాగంగా సేన్ 21-19, 21-14తో జులియన్ కరెగ్గి (బెల్జియం)ను వరుస సెట్లలో ఓడించాడు. వాస్తవానికి ఈ ఒలింపిక్స్‌లో సేన్‌కు ఇది రెండో మ్యాచ్. తొలి మ్యాచ్‌లో అతడు గ్వాటమెల్లా ప్రత్యర్థి కెవిన్ కార్డన్‌ను ఓడించాడు. కానీ కార్డన్ ఎడమ చేతి గాయం కారణంగా ఈ క్రీడల నుంచి తప్పుకున్నాడు. దీంతో నిర్వాహకులు ఆ విజయాన్ని 'డిలీట్' చేయడంతో సేన్‌కు ఇదే మొదటి మ్యాచ్ అయింది. ఇక మహిళల డబుల్స్‌లో భారత ద్వయం అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో 11-21, 12-21తో నమి మట్సుయమ-చిహారు షిదా (జపాన్) చేతిలో ఓడారు. భారత జోడీకి ఇది వరుసగా రెండో పరాభవం. మరో మ్యాచ్ ఓడితే ఈ జంట ఇంటి బాట పట్టడం ఖాయం!

మరో పతకంపై గురిపెట్టిన మను

10 మీటర్ల ఎయిర్ పిస్టల్ కాంస్య పోరుకు అర్హత

పారిస్: ఒలింపిక్స్ తాజా ఎడిషన్‌లో భారత్‌కు తొలి పతకం అందించిన షూటర్ మను భాకర్ మరో కాంస్యంపై గురిపెట్టింది. సోమవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫికేషన్ ఈవెంట్‌లో మను, సరబ్‌జ్యోత్ సింగ్ ద్వయం మూడో స్థానంలో నిలిచి క్వార్టర్స్ పోరుకు అర్హత సాధించింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో మను, సరబ్‌జ్యోత్ జోడీ.. 580 (20 షాట్లలో) పాయింట్లు స్కోరు చేసి పతక రేసులోకి వచ్చింది. నాలుగో స్థానంలో నిలిచిన దక్షిణ కొరియా (579 పాయింట్లు)తో క్వార్టర్స్‌లో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. 18 షాట్లలో 582 పాయింట్లు స్కోరు చేసిన టర్కీ అగ్రస్థానంలో నిలవగా 24 షాట్లలో 581 పాయింట్లు సాధించిన సెర్బియా స్వర్ణ, రజత పోరు కోసం తలపడతాయి. ఇదే ఈవెంట్‌లో బరిలో నిలిచిన మరో భారత ద్వయం రిథమ్ సంగ్వాన్, అర్జున్ సింగ్ పదో స్థానంతో పతక రేసు నుంచి నిష్క్రమించారు. మంగళవారం జరిగే మెడల్ ఈవెంట్‌లో గనక పతకం గెలిస్తే మను భాకర్ చరిత్ర సృష్టించినట్టే. భారత ఒలింపిక్ చరిత్రలో ఇప్పటిదాకా రెండు పతకాలు గెలిచినవారిలో సుశీల్ కుమార్ (రెజ్లర్), పీవీ సింధు (బ్యాడ్మింటన్)మాత్రమే ఉండగా వాళ్లిద్దరూ వేర్వేరు ఎడిషన్లలో మెడల్స్ కొట్టారు. ఒకే ఎడిషన్‌లో రెండు పతకాలు సాధించిన క్రీడాకారులైతే ఎవరూ లేరు. 1900లో నార్మన్ ప్రిచర్డ్ భారత్ తరపున ఆడుతూ ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు నెగ్గినా ఆయన బ్రిటన్ దేశస్థుడు. మరి మన మను ఏం చేసేనో!

పారాలింపిక్స్ అంపైర్‌గా రాజేందర్

కేసముద్రం, జూలై 29 : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం స్టేషన్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు కొమ్ము రాజేందర్ పారాలింపిక్ బ్యాడ్మింటన్ పోటీల అంపైర్ (టెక్నికల్ అఫీషియల్)గా ఎంపికయ్యాడు. ఈ క్రీడలు వచ్చే నెల 28 నుంచి సెప్టెంబర్ 8 వరకు పారిస్‌లో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలను వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్, రమేశ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గతంలోనూ అనేక అంతర్జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఆయన అంపైర్‌గా వ్యవహరించినట్లు వారు తెలిపారు.

బోపన్న రిటైర్మెంట్!

పారిస్: భారత టెన్నిస్ వెటరన్ రోహన్ బోపన్న తన సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు ప్రకటించాడు. భారత్ తరపున తన చివరి మ్యాచ్‌ను ఆడేసినట్టు బోపన్న తెలిపాడు. ఆదివారం రాత్రి జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో బోపన్న-శ్రీరామ్ బాలాజీ.. 5-7, 2-6తో రోజర్-మొన్‌ఫిల్స్ (ఫ్రెంచ్) చేతిలో ఓడి ఇంటిబాట పట్టారు. మ్యాచ్ అనంతరం బోపన్న మాట్లాడుతూ.. 'దేశం తరపున ఇదే నా చివరి మ్యాచ్. నేను ఎక్కడున్నాను? అనేదానిపై నాకు పూర్తి అవగాహన వచ్చింది' అని అన్నాడు. దేశం తరపున రిటైర్మెంట్ ప్రకటించినా ప్రొఫెషనల్ గ్రాండ్‌స్లామ్, ఏటీపీ టోర్నీలలో మాత్రం కొనసాగనున్నాడు.

జిమ్‌క్వీన్‌లో గాడియం సంచలనం

170 పతకాలతో మెరిసిన విద్యార్థులు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నగరంలోని గాడియం పాఠశాల పదో వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని రెండురోజుల పాటు నిర్వహించిన జిమ్‌క్వీన్-2024 పోటీలు విజయవంతంగా ముగిశాయి. గాడియం స్పోర్టోపీయాలో జరిగిన ఈ టోర్నీలో దేశవ్యాప్తంగా సుమారు 600 మంది అథ్లెట్లు పాల్గొనగా.. ఆతిథ్య గాడియం జిమ్నాస్ట్‌లు ఏకంగా 170 పతకాలు కొల్లగొట్టడం విశేషం. లెవల్ 1, 2 పోటీల్లో ఆ స్కూల్ విద్యార్థులు 146 పతకాలు సాధించగా అందులో 96 స్వర్ణాలున్నాయి. మిగిలిన విభాగాల్లో 24 పతకాలు సొంతం చేసుకున్న విద్యార్థులను గాడియం వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ కీర్తిరెడ్డి అభినందించారు.

జొకో జోరుకు చిత్తైన నాదల్

పారిస్: కొద్దిరోజుల క్రితమే ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలి రౌండ్‌కే వెనుదిరిగిన స్పెయిన్ దిగ్గజం రఫెల్ నాదల్ మరోసారి నిరాశజనక ప్రదర్శనతో తన ఒలింపిక్ సింగిల్స్ కెరీర్‌ను ఓటమితో ముగించాడు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో నాదల్.. 1-6, 4-6తో నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) చేతిలో ఓడాడు. 41 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో నాగల్ చేసిన పలు తప్పిదాలు అతడి పరాభవానికి దారితీశాయి. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన జొకో తదుపరి రౌండ్‌కు అర్హత సాధించాడు.

భారత్‌లో ఆసియా కప్

- 2027లో బంగ్లాదేశ్‌కు ఆతిథ్య హక్కులు

కౌలాలంపూర్: ప్రతి రెండేండ్లకోసారి జరిగే ఆసియా కప్ టోర్నీ తర్వాతి ఎడిషన్‌కు భారత్ ఆతిథ్యమివ్వనుంది. 2025లో టీ20 ఫార్మాట్‌లో జరుగబోయే ఈ టోర్నీకి ఆతిథ్య దేశంగా భారత్‌ను ఎంపిక చేసినట్టు ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2026లో భారత్, శ్రీలంక వేదికగా టీ20 ప్రపంచకప్ జరుగనున్న నేపథ్యంలో ఆ మెగా టోర్నీకి ముందు ఆసియా జట్లకు ఇది రిహార్సల్స్‌గా ఉండనుంది. ఇక 2027 ఆసియా కప్ (వన్డే ఫార్మాట్) బంగ్లాదేశ్‌లో జరుగుతుంది.

క్లీన్ స్వీప్ లక్ష్యంగా..

నేడే భారత్, శ్రీలంక ఆఖరి టీ20

పల్లెకెలె (శ్రీలంక): లంక పర్యటనలో తొలి రెండు టీ20లు గెలిచి జోరు మీదున్న యువ భారత జట్టు మంగళవారం నామమాత్రమైన మూడో మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. కొత్త కోచ్ గౌతం గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో అన్ని విభాగాల్లోనూ అదరగొడుతున్న భారత్.. అంతగా అనుభవం లేని లంకేయులపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. బ్యాటింగ్‌లో యశస్వీ జైస్వాల్, సూర్యకుమార్ యాదవ్, రిషభ్ పంత్, హార్దిక్ పాండ్యా దూకుడుగా పరుగులు రాబడుతుండగా బౌలర్లలో రవి బిష్ణోయ్ గత రెండు మ్యాచ్‌లలోనూ కీలకంగా మారాడు. మరోవైపు తొలి రెండు మ్యాచ్‌లలో ఓడిన శ్రీలంక ఈ మ్యాచ్‌లో అయినా గెలిచి పరువు నిలుపుకోవాలని ఆశిస్తోంది.

పతకాల పట్టిక

దే	స్వ	ర	కా	మొ
కొరియా	5	3	1	9
జపాన్	5	2	4	11
చైనా	5	2	2	9
ఫ్రాన్స్	4	7	3	14
ఆస్ట్రేలియా	4	3	0	7
యూఎస్ఏ	3	7	4	14
భారత్	0	0	1	1

దే: దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

ఆర్చర్లది అదే కథ

ఆర్చరీ టీమ్ ఈవెంట్స్‌లో క్వార్టర్స్ చేరిన భారత మహిళల జట్టు మాదిరిగానే పురుషులకూ ఓటమి తప్పలేదు. క్వార్టర్స్‌లో భారత్.. 2-6తో టర్కీ చేతిలో ఓడింది.

నోటి దురుసుకు తప్పదు భారీ మూల్యం

పారిస్: మహిళా స్విమ్మర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గాను వెటరన్ కామెంటేటర్ బాబ్ బొలార్డ్‌ను యూరోస్పోర్ట్స్ కామెంటరీ బాధ్యతల నుంచి తప్పించింది. ఆస్ట్రేలియా మహిళల 4X100 మీటర్ల ఫ్రీస్టయిల్ జట్టు స్వర్ణం గెలిచిన తర్వాత కామెంటరీ బాక్స్‌లో బొలార్డ్.. 'మహిళలు ఎలా ఉంటారో మీకు తెలుసా? చుట్టూ తిరుగుతూ ఒకరి మేకప్ గురించి మరొకరు చర్చించుకుంటారు' అని వ్యాఖ్యానించాడు. దీనిపై విమర్శలు రావడంతో యూరోస్పోర్ట్స్ తక్షణమే అతడిని కామెంటరీ బాధ్యతల నుంచి తొలగించింది.

డ్రాతో గట్టెక్కిన హాకీ జట్టు

హాకీలో అర్జెంటీనాతో జరిగిన పూల్-బీ రెండో మ్యాచ్‌లో భారత జట్టు డ్రా (1-1)తో గట్టెక్కింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ చివరి నిమిషం (59వ)లో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి ఉండకపోతే 'మెన్ ఇన్ బ్లూ'కు ఓటమి తప్పకపోయేది. ఈ మ్యాచ్‌లో అర్జెంటీనా తరపున లుకాస్ మార్టినెజ్ 22వ నిమిషంలోనే తొలి గోల్ కొట్టి ఆ జట్టును ఆధిక్యంలోకి తెచ్చాడు. ఆ తర్వాత అర్జెంటీనా డిఫెండర్లు భారత గోల్ ప్రయత్నాలను విజయవంతంగా అడ్డుకున్నారు. భారత్ కూడా సుమారు 9 పెనాల్టీ కార్నర్‌ల ద్వారా వచ్చిన సువర్ణావకాశాలను జారవిడుచుకుని పీకలమీదకు తెచ్చుకుంది. ఇక మ్యాచ్ ముగుస్తుందనగా హర్మన్‌ప్రీత్ అర్జెంటీనా రక్షణ శ్రేణిని తప్పిస్తూ చేసిన గోల్‌తో భారత్ మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. మంగళవారం ఐర్లాండ్‌తో మూడో మ్యాచ్‌లో భారత్ తలపడనుంది.

వనమహోత్సవంలో ఉత్సాహంగా పాల్గొనాలి

వనమహోత్సవంలో అందరూ ఉత్సాహంగా పాలుపంచుకోవాలని సింగరేణి సంస్థ సీఎండీ బలరాం పిలుపునిచ్చారు. సోమవారం తన పుట్టిన రోజు సందర్భంగా హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో మొక్క నాటారు. ఉద్యోగులు కూడా తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు.

-హైదరాబాద్

ఎట్ల కొడుతరో చూస్తా

- రాత్రి 11 తర్వాత రోడ్లపైకి వస్తా
- పేద యువకులపై పోలీసుల జులుం ఏంది?
- సర్కారుపై అసెంబ్లీలో అక్బరుద్దీన్ ఓవైసీ నిప్పులు

హైదరాబాద్, జూలై29 (నమస్తే తెలంగాణ): 'రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా గాడితప్పింది.. పోలీసులు రోజురోజుకూ పెట్రేగిపోతున్నరు.. 11దాటితే చాలు.. నిస్సహాయులపై లాఠీలతో జులుం చేస్తున్నరు. పేద యువకులపై పోలీసుల జులుం ఏంది? దాడులు ఇలాగే కొనసాగితే కోర్టుకు వెళ్తా. ఇక నుంచి ఎట్ల దాడి చేస్తరో చూస్తా..' అంటూ ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీ అసెంబ్లీలో సర్కారుపై నిప్పులు చెరిగారు. పోలీస్, ఎక్సైజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, బీసీ వెల్ఫేర్ తదితర శాఖలకు సంబంధించిన బడ్జెట్ పద్దులపై అసెంబ్లీలో సోమవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. పాతబస్తీలో ప్రజలు రాత్రి 11తర్వాత ఇంటి ముందు నిలబడ్డా పోలీసులు కొడుతున్నారని, 'ఫ్రెండ్లీ పోలీసులం కాదు' అని ప్రకటించుకునే స్థాయికి వెళ్లారని మండిపడ్డారు. పోలీసులు దౌర్జన్యాలను ఆపకుంటే తానే రాత్రి 11 తర్వాత రోడ్లపైకి వస్తానని, పోలీసులు ఎట్ల కొడుతరో చూస్తానని హెచ్చరించారు. నేరాలను అదుపు చేయడమే పోలీసుల ఉద్దేశమైతే అది పెద్ద కష్టమేమీ కాదని, ఎందుకంటే చట్టవ్యతిరేక కార్యకలాపాలు ఎవరు చేస్తున్నారో వారికి బాగా తెలుసునని, కానీ అక్రమార్కుల నుంచి ప్రతి స్టేషన్‌కు మామూళ్లు వెళ్తున్నందునే సామాన్యులపై తమ ప్రతాపం చూపుతున్నారని ఆరోపించారు. పోలీసులకు చిత్తశుద్ధి ఉంటే అమాయకులను కొట్టే బదులు వారిని ఎదుర్కోవాలని సవాల్ చేశారు. పోలీసు కమిషనర్ కార్యాలయం సమీపంలో దుకాణాలు అర్ధరాత్రి వరకు తెరిచి ఉంటాయని, ఇతర చోట్ల మాత్రం మూసివేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఒకే రోజు మూడు హత్యలు జరిగితే ఇక లా అండ్ ఆర్డర్ ఎక్కడుందని ప్రశ్నించారు. నగరంతో పాటు చార్మినార్ పరిసర ప్రాంతాలను కూడా అభివృద్ధి చేయాలని, పర్యాటకులకు వసతులు కల్పించాలని, పేదలకు ఉచిత విద్య అందిస్తున్న పాఠశాలలను అనుమతుల పేరిట వేధించవద్దని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధం అమలుచేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ ని ధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఓవైసీకి కేటీఆర్ ఆలింగనం

ప్రసంగం అనంతరం సభ నుంచి బయట కు వెళ్తున్న క్రమంలో అక్బరుద్దీన్‌తో కేటీఆర్‌తో ముచ్చటించారు. లా అండ్ ఆర్డర్, ఇతర అంశాలపై ఓవైసీ ప్రసంగానికి అభినందలు తెలిపారు. సీటు నుంచే ఆయనను ఆలింగనం చేసుకుని అభినందించారు.

పెద్దపల్లి జిల్లా ఓదెలలోని శివాలయంలోని నాగదేవతల విగ్రహంపైకి నాగుపాము ఎక్కి పడగ విప్పింది. గ్రామస్థులు వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌లు పెట్టి వైరల్ చేశారు. - ఓదెల

చెట్టులో భర్త జ్ఞాపకాలు

చెట్టుకు భర్త డ్రెస్ తొడిగి జయంతి వేడుక

చెట్టుకు డ్రెస్ వేసి, బెలూన్స్‌తో జన్మదినం

తాండూరు, జూలై 29: చనిపోయిన భర్త జ్ఞాపకాలను చెట్టు లో చూసుకుంటూ ఏటా జయం తి చేస్తున్నది వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి. సోమవారం తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఓ చెట్టుకు చనిపోయిన తన భర్త డ్రెస్ వేసి వినూత్నంగా చెట్టుకు పుట్టినరోజు, భర్తకు జయంతిని నిర్వహించింది. ఎనిమిదేండ్ల క్రితం విజయలక్ష్మి భర్త వెంకటయ్య అనారోగ్యంతో ఉండగా, తన ఇంటి ఎదుట మొక్క నాటారు. ఆయన మరణానంతరం విజయలక్ష్మి ఆ మొక్కను జాగ్రత్తగా పెంచుతున్నారు. ఆ మొక్క ఇప్పుడు చెట్టయ్యింది. ఏటా కుటుంబసభ్యులతో కలిసి ఆ చెట్టుకు బెలూన్స్ కట్టి పుట్టిన రోజు వేడుక నిర్వహిస్తున్నది. నేషనల్ హైవే వెడల్పులో భాగంగా విజయలక్ష్మి ఇంటి ముందున్న చెట్టును అధికారులు తొలగించే ప్రయత్నం చేయగా.. ఆమె వ్యవసాయ శాస్త్రవేత్తల అనుమతితో చెట్టును జేసీబీ సహాయంతో అక్కడికి తీసుకెళ్లి నాటారు. దీంతో ఆ చెట్టుకు పూజలు చేసి, పంచభక్ష పరమాన్నాలు పెట్టి వేడుక నిర్వహించింది.

అక్బరుద్దీన్‌వి దురహంకార వ్యాఖ్యలు

- కేంద్రసహాయ మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో అక్బరుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలు ఆయన దురహంకారానికి నిదర్శనమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఎవరో ఒక పోలీస్ తప్పు చేస్తే మొత్తం వ్యవస్థను, పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. పాతబస్తీలో ట్రాఫిక్ రూల్స్ పాటించని ఎంఐఎం నేతలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టంచేశారు.

అధికారులూ.. లంచాలు మానండి

చర్యలు తప్పవని జుక్కల్ ఎమ్మెల్యే హెచ్చరిక

ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

బాన్సువాడ, జూలై 29: లంచగొండి అధికారులకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు హెచ్చరికలు జారీ చేశారు. కొందరు అధికారులు లంచం తీసుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అలాంటి వారు తక్షణమే పద్ధతి మార్చుకోవాలని, లేకపోతే చర్యలు తప్పవని సూచించారు. సోమవారం ఆయన సోషల్ మీడియాలో ఓ వీడియో రిలీజ్ చేశారు. 'వర్షాలు సమృద్ధిగా కురువడం, రైతులకు రుణమాఫీ జరుగుతుండటం శుభపరిణామం. ఇలాంటి శుభ సందర్భంలో జుక్కల్ నియోజకవర్గంలోని కొంతమంది అధికారులు, ప్రధానంగా రెవెన్యూ ఉద్యోగులు లంచాలు తీసుకుంటున్నారని తన దృష్టికి వచ్చిందని, ఇలాంటి వాటిని ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. 'ప్రజలకు సేవ చేసేందుకే మీరు జీతం తీసుకుంటున్నారు. జీతం సరిపోకపోతే ఉద్యోగం మానుకుని మీకు డబ్బులు వచ్చే మరో ఉద్యోగం చూసుకోండి. లేకపోతే జుక్కల్ నియోజకవర్గాన్ని వదిలేసి వెళ్లండి' అని హెచ్చరించారు.

బిల్లుల కోసమే కాంగ్రెస్‌లోకి పోచారం

ఏనుగు రవీందర్‌రెడ్డి అనుచరుల ఆరోపణ



మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి అనుచరులు

బాన్సువాడ, జూలై 29: కాంట్రాక్టు బిల్లుల కోసమే బీఆర్ఎస్ నుంచి గెలిచిన పోచారం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లోకి వచ్చారని, ప్రజల సంక్షేమం కోసం కాదని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అనుచరులు ఆరోపించారు. సోమవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని ఏనుగు క్యాంపు కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం, రైతుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినట్టు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి చెప్పడం పచ్చి అబద్ధమని మండిపడ్డారు. కేవలం కుమారుల కాంట్రాక్ట్ బిల్లుల కోసమే కాంగ్రెస్‌లో చేరారని ఆరోపించారు. పోచారం పుత్రుడి బిల్లులు రూ.5.35 కోట్లు మంజూరు చేయించుకున్నారని, ఆధారాలు ఉన్నాయని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, నేతలు చెప్పారు.